భారీగా బీమా క్లెయింల తిరస్కరణ

- **15 వేల కోట్ల హెల్త్ ఇన్సూరెన్స్ క్లెయింలు వెనుకకు**
- **రూ.1.2 లక్షల కోట్ల క్లెయింల సెటిల్‌మెంట్**
- **2023-24 ఆర్థిక సంవత్సరపు నివేదికలో ఐఆర్‌డీఏఐ**

న్యూఢిల్లీ, డిసెంబర్ 30: ఆరోగ్య బీమా తీసుకున్నవారికి ఆసుపత్రులు గట్టి షాకిస్తున్నాయి. క్లెయిం సెటిలమెంట్లలో చాలా కొరివిలు పెడుతున్నాయి. దీంతో వేలాది కోట్ల హెల్త్ ఇన్సూరెన్స్ క్లెయింలు తిరస్కరణకు గురవుతున్నాయి. బీమా నియంత్రణ మండలి ఐఆర్‌డీఏఐ తాజాగా విడుదల చేసిన నివేదికలోనూ ఇదే విషయం స్పష్టమైంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.15,100 కోట్లు హెల్త్ ఇన్సూరెన్స్ క్లెయింల తిరస్కరించబడ్డాయని తెలిపింది. మొత్తం క్లెయిం సెటిల్‌మెంట్లలో వీటి వాటా 12.9 శాతంగా ఉన్నదని పేర్కొంది. రూ.1.17 లక్షల కోట్ల క్లెయిం సెటిల్‌మెంట్లలో రూ.83,493.17 కోట్లు లేదా 71.29 శాతం చెల్లింపులు జరిపారని తన వార్షికపు నివేదికలో వెల్లడించింది. వీటితో పాటు బీమా సంస్థలు రూ.10,937.18 కోట్ల క్లెయింలను తిరస్కరించగా, రూ.7,584.57 కోట్లు చెల్లింపులు జరుపాల్సివున్నది. గడిచిన ఆర్థిక సంవత్సరంలో 3.26 కోట్ల హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీలు క్లెయింలుకాగా, వీటిలో 2.69 కోట్లు(82.46 శాతం) చెల్లింపులు జరిగాయి. ఒక్కో క్లెయిం సరాసరి రూ.31,086గా ఉన్నట్టు తెలిపింది. క్లెయిం సెటిల్‌మెంట్లలో 66.16 శాతం క్యాష్‌లెస్ పద్ధతిన సెటిల్ కాగా, 39 శాతం రియంబర్స్‌మెంట్ పద్ధతిన జరిగాయని పేర్కొంది.

- 2023-24లో జనరల్, హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీలు రూ.1,07,681 కోట్ల ప్రీమియాన్ని వసూలు చేశాయి.
- ప్రస్తుతం 25 జనరల్ ఇన్సూరెన్స్, 8 హెల్త్ ఇన్సూరెన్స్ సేవలు అందిస్తున్నాయి
- ప్రభుత్వరంగ సంస్థలైన న్యూ ఇండియా, నేషనల్ అండ్ ఒరియంటల్ ఇన్సూరెన్స్‌లు హెల్త్ ఇన్సూరెన్స్ బీమా సేవలు అందిస్తున్నాయి.
- గడిచిన ఆర్థిక సంవత్సరంలో 165.05 కోట్ల మంది వ్యక్తిగత ప్రమాద బీమా తీసుకున్నారు.
- 90.10 కోట్ల మందికి ప్రభుత్వం అందిస్తున్న ప్రధాన పథకాలైన ప్రధాన్ మంత్రి సురక్ష బీమా యోజన, ప్రధాన్ మంత్రి జన్‌ధన్ యోజన, ఐఆర్‌సీటీసీల కింద బీమా పొందుతున్నారు.

అదానీ విల్మర్‌కు గుడ్‌బై

పూర్తి వాటాను అమ్మేస్తున్న గౌతమ్ అదానీ

డీల్ విలువ దాదాపు రూ.17,100 కోట్లు

విల్మర్ చేతికి మరో 43.94 శాతం వాటా

ఇక ఎఫ్ఎంసీజీ రంగానికి అదానీ గ్రూప్ దూరం

న్యూఢిల్లీ, డిసెంబర్ 30: భారతీయ బహుళ వ్యాపార, పారిశ్రామిక రంగ దిగ్గజం గౌతమ్ అదానీ గ్రూప్.. ఎఫ్ఎంసీజీ జాయింట్ వెంచర్ అదానీ విల్మర్ నుంచి తప్పుకుంటున్నది. అందులో ఉన్న మొత్తం వాటాను దాదాపు రూ.17,100 కోట్ల (2 బిలియన్ డాలర్లు)కు అమ్మేస్తున్నట్టు సోమవారం గ్రూప్ ప్రకటించింది. దీంతో ఎఫ్ఎంసీజీ రంగానికే అదానీ గుడ్‌బై చెప్పేస్తుండటం గమనార్హం. నిజానికి ప్రతీ రంగంలోనూ ఆయా కంపెనీలను హస్తగతం చేసుకుంటూ తన ఉనికిని విస్తరిస్తూపోతున్న అదానీ గ్రూప్.. ఇలా రెండున్నర దశాబ్దాల చరిత్ర ఉన్న సంస్థను వదులుకుంటూ ఏకంగా ఓ రంగం నుంచే వైదొలుగుతుండటం మిక్కిలి ప్రాధాన్యతను సంతరించుకుంటున్నదిప్పుడు.

1999లో..

సుమారు 25 ఏండ్ల క్రితం 1999 జనవరిలో సింగపూర్‌కు చెందిన కమోడిటీ ట్రేడర్ విల్మర్‌తో కలిసి అదానీ గ్రూప్ ఈ అదానీ విల్మర్ లిమిటెడ్‌ను ఏర్పాటు చేసింది. ఇందులో ప్రస్తుతం అదానీ ఎంటర్‌ప్రైజెస్‌కు 43.94 శాతం వాటా ఉండగా, దీనంతటినీ తమ భాగస్వామి విల్మర్ ఇంటర్నేషనల్‌కే అదానీ గ్రూప్ విక్రయిస్తున్నది. 31.06 శాతం వాటాను రూ.12,314 కోట్లకు అమ్ముతున్న అదానీ.. కనీస పబ్లిక్ షేర్‌హోల్డింగ్ అవసరాలకు అనుగుణంగా మరో 12.88 శాతం వాటాను ఓపెన్ మార్కెట్‌లో దాదాపు రూ.4,786 కోట్లకు విక్రయిస్తున్నది. కాగా, గౌతమ్ అదానీ, ఆయన సంస్థపై అమెరికాలో లంచం నేరారోపణలు వచ్చిన దగ్గర్నుంచి అదానీ గ్రూప్‌లో జరుగుతున్న బిగ్ డీల్ ఇదే. వచ్చే ఏడాది మార్చి 31కల్లా ఈ లావాదేవీ పూర్తికావచ్చన్న అంచనాలున్నాయి.

- *ఫార్చ్యూన్ బ్రాండ్‌లో వంటనూనె, గోధుమ పిండి, పప్పు ధాన్యాలు, బియ్యం, చక్కెరలను తయారుచేసి మార్కెట్‌లో విక్రయిస్తున్న అదానీ విల్మర్.*
- ***దేశవ్యాప్తంగా 10 రాష్ర్టాల్లో సంస్థకు 23 ప్లాంట్లున్నాయి.***
- *2022 ఫిబ్రవరిలో రూ.3,600 కోట్లతో వచ్చిన ఐపీవో ద్వారా దేశీయ స్టాక్ మార్కెట్లలోకి ప్రవేశం.*
- ***ప్రస్తుతం కంపెనీ మార్కెట్ విలువ రూ.42,785 కోట్లు (5 బిలియన్ డాలర్లు).***
- *గత ఆర్థిక సంవత్సరం (2023-24) అదానీ విల్మర్ ఏకీకృత మొత్తం ఆదాయం రూ.51,555.24 కోట్లుగా నమోదు.*

ఏఈఎల్‌కు దన్ను

అదానీ విల్మర్‌లో వాటాలను అమ్మేస్తున్న అదానీ గ్రూప్.. ఇలా వస్తున్న నిధులను కీలక మౌలిక వ్యాపారాల్లో పెట్టుబడిగా పెట్టబోతున్నది. దీంతో అదానీ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ (ఏఈఎల్)కు మరింత దన్ను లభించనున్నది. ఎనర్జీ, యుటిలిటీ, రవాణా, లాజిస్టిక్స్ తదితర విభాగాల్లో అదానీ పట్టును పెంచుకోవడానికి ఈ సొమ్మును వాడుకోబోతున్నట్టు కంపెనీ తాజా ప్రకటన ద్వారా తెలియవస్తున్నది. ఫలితంగా ఏఈఎల్ సామర్థ్యం మరింతగా పెరుగుతుందని ఇండస్ట్రీ వర్గాల అంచనా. ముఖ్యంగా విమానాశ్రయాలు, అదానీ డిజిటల్ వంటి వాటిపై ఇంకా శ్రద్ధ పెట్టవచ్చని కూడా అదానీ గ్రూప్ భావిస్తున్నట్టు ట్రేడ్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

యాపిల్ మొబైళ్లపై విజయ్ ఆఫర్లు

హైదరాబాద్, డిసెంబర్ 30: ప్రముఖ ఎలక్ట్రానిక్స్ పరికరాల రిటైల్ సంస్థ విజయ్ సేల్స్..యాపిల్ ఉత్పత్తులపై భారీ రాయితీని ప్రకటించింది. వచ్చే నెల 5 వరకు అందుబాటులో ఉండనున్న ఈ ఆఫర్ కింద అన్ని రకాల ఐఫోన్లు, మ్యాక్‌బుక్స్, ఐప్యాడ్స్, వాచెస్, ఎయిర్‌పాడ్స్‌లను తగ్గింపు ధరకు విక్రయిస్తున్నది. ఐసీఐసీఐ, ఎస్బీఐ, కొటక్ మహీంద్రా బ్యాంక్ కార్డులపై రూ.3 వేల వరకు ఇన్‌స్టంట్ డిస్కౌంట్‌ను కలిపిస్తున్నది.

ఎన్ఎండీసీ సీఎండీ పదవీకాలం పొడిగింపు

హైదరాబాద్, డిసెంబర్ 30: ఎన్ఎండీసీ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అమితవ ముఖర్జీ పదవీకాలాన్ని మరో ఏడాది పొడిగిస్తూ కేంద్ర ప్రభుత్వం తాజాగా నిర్ణయం తీసుకున్నది. ప్రస్తుతం ఫైనాన్స్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయన.. మరో ఏడాది లేక కొత్త వ్యక్తిని నియమించేవరకు సీఎండీగా అదనపు బాధ్యతలు నిర్వహించనున్నారు. 1995 ఐఆర్ఏఎస్ బ్యాచ్‌కు చెందిన వ్యక్తి ముఖర్జీ.

ఐకియా నష్టం 1,299 కోట్లు

న్యూఢిల్లీ, డిసెంబర్ 30: ప్రముఖ ఫర్నీచర్ ఉత్పత్తుల విక్రయ సంస్థ ఐకియా ఇండియా భారీ నష్టాలను చవిచూసింది. 2023-24 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.1,299.40 కోట్ల నష్టం వచ్చింది. ఆదాయం మాత్రం ఏడాదిప్రాతిపదికన 4.5 శాతం ఎగబాకి రూ.1,809.8 కోట్లకు చేరుకున్నట్లు వెల్లడించింది. వ్యాపారాన్ని విస్తరించడానికి అధికంగా నిధులు వెచ్చించడం వల్లనే లాభాల్లో గండిపడిందని కంపెనీ వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం సంస్థకు హైదరాబాద్, నవీ ముంబై, బెంగళూరులలో అవుట్‌లెట్లు ఉన్నాయి. వీటికోసం ప్రకటనల రూపంలో రూ.196.3 కోట్ల నిధులను వెచ్చించింది.

31 వరకు వివాద్ సే విశ్వాస్

న్యూఢిల్లీ, డిసెంబర్ 30: పన్ను బకాయిలు, వడ్డీ, జరిమానా మాఫీ కోసం కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన వివాద్ సే విశ్వాస్ స్కీం గడువును జనవరి 31 వరకు పెంచుతూ ఆదాయ మంత్రిత్వ శాఖ నిర్ణయం తీసుకున్నది. ఈ నెల 31లోపు పన్ను చెల్లింపుదారులు పూర్తిగా తమ బకాయిలు చెల్లించాలని గతంలో ఆదేశించింది. దీంట్లో వడ్డీ, జరిమానాను పూర్తిగా ఎత్తివేస్తున్నారు. సోమవారం కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు(సీబీడీటీ) తాజా నోటిఫికేషన్‌లో ఈ విషయాన్ని వెల్లడించింది. ఫిబ్రవరి 1 నుంచి పన్ను చెల్లింపుదారులు 110 శాతం బకాయిలు, వడ్డీ, జరిమానాతో కలిపి చెల్లించాల్సి ఉంటుందని పేర్కొంది.

దేశంలో పెరిగిన సైబర్ మోసాలు

ఆర్బీఐ తాజా నివేదికలో వెల్లడి

ముంబై, డిసెంబర్ 30: దేశంలో సైబర్ మోసాలు పెరిగాయి. డిజిటల్ లావాదేవీలు జోరుగా సాగుతున్న నేపథ్యంలో అమాయకులే లక్ష్యంగా సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) తాజా నివేదికే ఇందుకు నిదర్శనం. డిసెంబర్ నెలకుగాను ఆర్థిక సుస్థిరత నివేదిక (ఎఫ్ఎస్ఆర్) పేరిట సోమవారం ఆర్బీఐ రిపోర్టు విడుదల చేసింది. ఇందులో ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) ప్రథమార్ధం (ఏప్రిల్-సెప్టెంబర్) 18,461 సైబర్ మోసాలు జరిగాయని, వీటి విలువ రూ.21,367 కోట్లని తెలియజేసింది. గత ఆర్థిక సంవత్సరం (2023-24) ఇదే వ్యవధిలో 14,480 కేసులు నమోదయ్యాయని, వాటి విలువ కేవలం 2,623 కోట్లేనన్నది. ఈ క్రమంలోనే సైబర్ మోసాల గురించి అందరిలోనూ అవగాహన పెరగాల్సిన అవసరం ఉన్నదని నొక్కి చెప్పింది. అంతేగాక మనీ లాండరింగ్‌కు దారితీసే మ్యూల్ అకౌంట్స్‌ను గుర్తించడం కూడా చాలా ముఖ్యమని పేర్కొన్నది. కాగా, సైబర్ మోసాల బారినపడ్డ బాధితులు ఆర్థికంగా నష్టపోతున్నారని, మానసికంగా కూడా తీవ్ర ఆవేదనకు లోనవుతున్నారని ఆర్బీఐ ఈ సందర్భంగా ఒకింత ఆందోళన వ్యక్తం చేసింది.



ఈసారి జీడీపీ 6.6 శాతం

ఈ ఆర్థిక సంవత్సరం జీడీపీ వృద్ధిరేటు 6.6 శాతంగా ఉండొచ్చని ఆర్బీఐ ఈ సందర్భంగా అంచనా వేసింది. వచ్చే ఏడాది ఆర్థిక వ్యవస్థ మెరుగుపడే అవకాశాలే ఉన్నాయని ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా అన్నారు.

నెఫ్ట్, ఆర్టీజీఎస్‌ల్లో లబ్ధిదారు పేరు

వచ్చే ఏడాది ఏప్రిల్ 1 నుంచి ఆన్‌లైన్ ఫండ్ ట్రాన్స్‌ఫర్ వ్యవస్థలైన నేషనల్ ఎలక్ట్రానిక్ ఫండ్స్ ట్రాన్స్‌ఫర్ (నెఫ్ట్), రియల్ టైమ్ గ్రాస్ సెటిల్మెంట్ (ఆర్టీజీఎస్)ల్లో వినియోగదారులకు లబ్ధిదారు పేరు కనిపించే సదుపాయాన్ని బ్యాంకులు కల్పించనున్నాయి. ఈ మేరకు సోమవారం ఆర్బీఐ ఓ సర్క్యులర్‌ను జారీ చేసింది. ప్రస్తుతం యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ), ఇమ్మీడియేట్ పేమెంట్స్ సర్వీస్ (ఐఎంపీఎస్) సిస్టమ్స్‌ల్లోనే ఈ తరహా సౌకర్యం ఉన్నది. నగదు పంపించేవారు ఎవరికైతే పంపిస్తున్నామో వారి పేరును నగదు బదిలీకి ముందే పరిశీలించుకోవచ్చు. దీంతో ఏప్రిల్ 1 నుంచి నెఫ్ట్, ఆర్టీజీఎస్‌ల ద్వారా నగదు బదిలీ చేసేవారికీ ఈ అవకాశం రానున్నది.

ముంచిన బ్లూచిప్‌లు

సెన్సెక్స్ 451, నిఫ్టీ 169 పాయింట్ల పతనం



ముంబై, డిసెంబర్ 30: దేశీయ స్టాక్ మార్కెట్ల నష్టాల పరంపర కొనసాగుతున్నది. బ్లూచిప్ సంస్థలైన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు తీవ్ర ఒత్తిడికి గురికావడంతోపాటు అంతర్జాతీయ మార్కెట్లు బలహీనంగా ఉండటం, విదేశీ సంస్థాగత పెట్టుబడులు వెళ్లిపోవడంతో సూచీలు భారీగా నష్టపోయాయి. తీవ్ర ఒడిదొడుకుల మధ్య ట్రేడైన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 450.94 పాయింట్లు నష్టపోయి 78,246.13 వద్ద ముగిసింది. 30 షేర్ల ఇండెక్స్‌లో 23 నష్టపోగా, కేవలం ఏడు మాత్రమే లాభాల్లో ముగిశాయి. మరో సూచీ నిఫ్టీ 168.50 పాయింట్లు కోల్పోయి 23,644.90 వద్ద ముగిసింది. దేశీయ ఆటోమొబైల్ దిగ్గజాల్లో ఒకటైన టాటా మోటర్స్ అత్యధికంగా 2.24 శాతం నష్టపోయింది. దీంతోపాటు టైటాన్, టాటా స్టీల్, ఎస్బీఐ, మహీంద్రా, ఎన్‌టీపీసీ, ఐసీఐసీఐ బ్యాంక్, మారుతి, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, రిలయన్స్, ఇన్ఫోసిస్‌లు నష్టపోయాయి. కానీ, జొమాటో, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, ఇండస్‌ఇండ్ బ్యాంక్‌లు లాభాల్లో ముగిశాయి. రంగాలవారీగా చూస్తే మెటల్ రంగ సూచీ అత్యధికంగా 2 శాతం వరకు నష్టపోగా, క్యాపిటల్ గూడ్స్ 1.84 శాతం, సర్వీసెస్, ఇండస్ట్రీయల్స్, కమోడిటీస్ సూచీలు పతనం చెందాయి. మరోవైపు, రూపాయి గింగిరాలు కొడుతున్నది. రోజుకొక కనిష్ఠ స్థాయికి జారుకుంటున్న విలువ మరో చారిత్రక కనిష్ఠ స్థాయికి పడిపోయింది. దిగుమతిదారుల నుంచి డాలర్‌కు అనూహ్యంగా డిమాండ్ నెలకొనడంతో రూపాయి విలువ 4 పైసలు కోల్పోయి 85.52 వద్ద నిలిచింది.

నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్

పరామర్శ

గోదావరిఖని, డిసెంబర్ 30: రామగుండం నియోజకవర్గంలో పలువురు ఇటీవల మృతి చెందగా, బాధిత కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ సోమవారం పరామర్శించారు. పట్టణంలోని కారం వినయ్ తండ్రి కారం రాజేశ్వర్‌రావు మృతిచెందగా బాధిత కుటంబాన్ని చందర్ పరామర్శించారు. 1వ డివిజన్ పాముల పేటలో గన్న రమేశ్ కుటుంబం, మార్కండేయకాలనీలో బీఆర్ఎస్ నాయకుడు అయిల్ల నాగరాజును, ఐదో డివిజన్ మల్కాపూర్‌లో తెలంగాణ ఉద్యమ అమరుడు మామిడాల సత్యనారాయణ తండ్రి మామిడాల కొమురయ్య మృతిచెందగా ఆయ కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం ఆత్మహత్యకు పాల్పడిన ముక్క రోహన్ కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట కార్పొరేటర్లు కృష్ణవేణి, ముదాం శ్రీనివాస్, జేవీ రాజు, నాయకులు బొడ్డుపల్లి శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, నారాయణదాసు మారుతి, చెలకలపల్లి శ్రీనివాస్, మెతుకు దేవరాజ్, నీరటి శ్రీనివాస్, పల్లికొండ నరేశ్, వంశీకృష్ణ, లెక్కల సరళ, జనగామశంకర్, ఆకుల రాజారాం, భానుచందర్ ఉన్నారు.

ఠాణాకు వచ్చే బాధితులకు భరోసా కల్పించాలి

మంథని, డిసెంబర్ 30: ఠాణాకు వచ్చే బాధితులకు నమ్మకం, భరోసా కల్పించాలని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం. శ్రీనివాస్ సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా మంథని పోలీస్ స్టేషన్‌ను సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఠాణాకు చేరుకున్న సీపీకి పోలీస్ అధికారులు మొక్క అందజేసి స్వాగతం పలికారు. సాయుధ పోలీసులు గౌరవ వందనం చేశారు. అనంతరం సీపీ ఠాణా పరిసరాలను పరిశీలించారు. స్టేషన్ రిసెప్షన్ సిబ్బంది పనితీరు, రికార్డులను పరిశీలించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదులపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు, ఆన్‌లైన్ వంటి అంశాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అండర్ ఇన్వెస్టిగేషన్‌లో ఉన్న సీడీ ఫైల్స్, ఇతర ఫైళ్లను పరిశీలించారు. నిందితుల అరెస్ట్, రౌడీ షీటర్ల వివరాలు, కోర్డులో పెండింగ్‌లో ఉన్న కేసులు, వాటికి సంబంధించిన దర్యాప్తు వివరాలు, రోడ్డు ప్రమాదాల నివారణ, నేరాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు, సమస్యాత్మక గ్రామాల వివరాలు, ట్రబుల్ మాంగర్స్, రౌడీ షీటర్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్టేషన్‌లో పని చేస్తున్న సిబ్బందితో మాట్లాడి ఎవరికైనా ఏదైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే వారితో అధికారులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలన్నారు. నేరాల కట్టడికి అధికారులు మరింత శ్రమించడంతో పాటు, నేరం జరిగిన వెంటనే స్టేషన్ అధికారులు వేగంగా స్పందించాలన్నారు. చట్టాలను అతిక్రమించే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. బ్లూ కోల్ట్స్ సిబ్బంది డయల్ 100 కాల్స్ కి వెంటనే స్పందించి వారు సంఘటన స్థలానికి త్వరగా చేరుకోవాలన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించి ప్రజల సమస్యలు తెలుసుకోవాలన్నారు. గంజాయి, మత్తు పదార్థాల సరఫరా, విక్రయం, అక్రమ రవాణా,అసాంఘిక కార్యకలాపాలపై నిరంతర నిఘా ఉంచాలన్నారు. సీపీ వెంట పెద్దపల్లి డీసీపీ చేతన, గోదావరిఖని ఏసీపీ రమేష్, సీఐ రాజు, ఎస్ఐ రమేశ్ ఉన్నారు.

పోలీసుల గౌరవ వందన స్వీకరిస్తున్న సీపీ శ్రీనివాస్

కార్మికుడి మృతదేహాన్ని పరామర్శిస్తున్న తోటి ఉద్యోగులు

గుండెపోటుతో కార్మికుడి మృతి

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబర్ 30 : సింగరేణి సంస్థ ఆర్జీ-2 ఏరియాలో ఓసీపీ-3 ప్రాజెక్టులో పని చేస్తున్న సామల రామ్మూర్తి (50) సోమవారం గుండెపోటుతో మృతి చెందాడు. సకాలంలో అంబులెన్స్ వచ్చి ఉంటే బతికేవాడని తోటి కార్మికులు డిస్పెన్సరీ వద్ద ఆందోళన చేపట్టారు. ఘటనకు సంబంధించి తోటి కార్మికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఓసీపీ-3 ప్రాజెక్టు ఈపీ గ్రీజర్ హెల్పర్‌గా పని చేస్తున్న రామ్మూర్తి షైలట్ క్వారీలో రెండో షిప్టులో విధులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలోనే సుమారు 7. 50 గంటలకు ఛాతీలో నొప్పి వస్తుందని తోటి ఉద్యోగులకు చెప్పాడు. వెంటనే వారు పై అధికారులకు సమాచారం ఇచ్చారు. అంబులెన్స్ వచ్చిన వెంటనే అతన్ని సెక్టార్-3 డిస్పెన్సరీకి తీసుకెళ్లి వైద్య పరీక్షలు చేయించారు. అప్పటికే రామ్మూర్తి చనిపోయాడని చెందాడని వైద్యులు పేర్కొన్నారు. వెయ్యికి పైగా ఉద్యోగులు పని చేస్తున్న మెగా ప్రాజెక్టుపై కోల్ నిబంధనల ప్రకారం ఒక అంబులెన్స్ ఉండాలని, అది లేకపోవడంతోనే తమ తోటి ఉద్యోగి మృతి చెందడాన్నారు. ఉద్యోగి మరణానికి యాజమాన్యదే బాధ్యతయని వాపోయారు.

జీఎం కార్యాలయంలో స్ట్రక్చర్ మీటింగ్

గోదావరిఖని, డిసెంబర్ 30: సింగరేణి ఆర్జీ-1 జీఎం కార్యాలయంలో సోమవారం గుర్తింపు సంఘం ప్రతినిధులు, ఆర్జీ-1లోని వివిధ విభాగాల అధికారులతో జీఎం లలిత్‌కుమార్ ఆధ్వర్యంలో ఏరియా స్థాయి స్రక్చర్ మీటింగ్ జరిగింది. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై చర్చించారు. కొన్ని పరిష్కారం కాగా మరికొన్ని జరుగాల్సి ఉందని జీఎం పేర్కొన్నారు. అనంతరం సమావేశం ఎజెండా అంశాలను పేర్కొన్నారు. ఇక్కడ ఏఐటీయూసీ బ్రాంచీ సెక్రటరీ ఆరెల్లి పోశం, ఎస్ఓటు జీఎం గోపాల్‌సింగ్, ఏజీఎంలు రావు, ఆంజనేయులు, శివనారాయణ, ప్రాజెక్టు అధికారి చంద్రశేఖర్, ఏసీఎంవో కిరణ్ రాజ్‌కుమార్, డీజీఎం పర్సనల్ కిరణ్‌బాబు, మేనేజర్ రవీందర్‌రెడ్డి, ఏజెంట్లు చిలుక శ్రీనివాస్, రమేశ్, సిద్ధమల్ల రాజు, మహేశ్, మల్లికార్జున్, వెంకటరెడ్డి, మిట్ట శంకరయ్య ఉన్నారు.

సంస్థ పురోభివృద్ధికి కృషి చేయాలి

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబర్ 30 : సింగరేణి సంస్థలో నూతనంగా ఉద్యోగాలు పొందిన వారు సంస్థ పురోభివృద్ధికి తమ మేధాశక్తిని ఉపయోగించాలని ఆర్జీ-2 జీఎం బీ. వెంకటయ్య కోరారు. సోమవారం నిమ్ అతిథి గృహంలో నూతన ఉద్యోగులకు హైడ్రోజియాలజీ, మేనేజ్‌మెంట్ శిక్షణ తరగతులను ప్రారంభించి మాట్లాడారు. రెండు వారాలపాటు జరుగనున్న శిక్షణా తరగతుల్లో పై అధికారులు చెప్పే ప్రతి అంశాన్ని అర్థం చేసుకుని విధుల్లో అమలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నిమ్ డీజీఎం హుస్సేనీ, సింటార్స్ డీజీఎం జీవీఎన్ విజయ్ కుమార్, ఐఈడీ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నివాస గృహాలకు రీ సర్వే చేయించాలి

మంథని రూరల్, డిసెంబర్ 30: మండలంలోని పుట్టపాక గ్రామ సమీపం నుంచి వెళ్తున్న విజయవాడ టూ నాగపూర్ నేషనల్ హైవేలో కోల్పోతున్న నిర్వాసితుల ఇండ్లకు రీ సర్వే చేయించాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌కు గ్రామస్తులు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నేషనల్ హైవే నిర్మాణంలో ఇండ్లకు తక్కువగా పరిహారం వచ్చే విధంగా ఎస్టిమేషన్ వేశారన్నారు. దీని ద్వారా ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. నిర్వాసితులకు న్యాయం జరిగే లా తిరిగి సర్వే చేయించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన మంత్రి త్వరలోనే అధికారులతో మాట్లాడుతామని తెలిపారు. ఇక్కడ గ్రామస్తులు రొడ్డ శ్రీనివాస్, ఆకుల సత్తయ్య, రాజయ్య, రొడ్డ సాయికృష్ణ, మల్లయ్య, వీరారెడ్డి ఉన్నారు.

అనుమతి లేని పెట్రోల్ బంక్‌లకు నోటీసులు

కోల్‌సిటీ, డిసెంబర్ 30: అనుమతి లేని పెట్రోల్ బంక్‌లపై నగరపాలక సంస్థ నోటీసుల జారీతో ఝులిపించిందిజ ఈ మేరకు సోమవారం మూడు పెట్రోల్ బంక్‌లకు నగరపాలక కమిషనర్ పెనాల్టీలు చెల్లించాలని నోటీసులో పేర్కొన్నారు. సంతోషి మాత ఆటో సర్వీస్(ఇండియన్ ఆయిల్)కు రూ.14,78, 406, లేపాక్సి ట్రాన్స్‌పోర్టు(హెచ్‌పీ) రూ.38, 50, 410, హర ఫిల్లింగ్ స్టేషన్(అడాక్) రూ.19,36 ,185 చొప్పున నిర్ణీత గడువులోపు పెనాల్టీలు చెల్లించాలని ఆదేశించారు. లేనిపక్షంలో టీఎస్ఎం 2019 యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

28 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

మంథని రూరల్, డిసెంబర్30: రేషన్ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేస్తుండగా ఎక్లాస్‌పూర్ చెక్ పోస్టు వద్ద పట్టుకున్నట్లు మంథని ఎస్ఐ డీ రమేశ్ తెలిపారు. ఇల్లందు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి మహారాష్ట్రకు వాహనంలో రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారంతో సోమవారం ఎక్లాస్‌పూర్ చెక్ పోస్టు వద్ద పోలీస్, సివిల్ సప్లై అధికారులు సంయుక్తంగా వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. అక్రమంగా ప్రజా పంపిణీ బియ్యాన్ని టీఎస్ 02 యూసీ 8458 వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా అందులో 400 ప్లాస్టిక్ సంచుల్లో ప్రజా పంపిణీ బియ్యం 28 టన్నులు ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. వీటి విలువ రూ. 10, 92, 000 ఉంటుందని సివిల్ సప్లై అధికా రులు చెప్పినట్లు తెలిపారు. లారీ డ్రైవర్ నర్రా పెద్దలు, లారీ క్లీనర్ దాసరి బాబు అదుపులోకి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. చాకచక్యంగా వ్యవహ రించి రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్న ఎస్ఐ, పోలీస్ సిబ్బంది సీఐ రాజు అభినందించారు.

పౌరహక్కుల దినం

ఎలిగేడు, డిసెంబర్ 30: బుర్హాన్‌మియాపేటలో సోమవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. గ్రామంలో కుల వివక్ష చూపవద్దని, అందరూ కలిసి మెలిసి ఉండాలని డిప్యూటీ తహసీల్దార్ కిరణ్ కుమార్ సూచించారు. కార్యక్రమంలో అధికారులు, అంబేద్కర్ సంఘం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మొట్లపల్లిలో..

కాల్వశ్రీరాంపూర్,డిసెంబర్ 30: మొట్లపల్లిలో సోమవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో డీటీ శంకర్, ఆర్ఐ అజీమ్, ఆయా శాఖల అధికారులు, దళిత సంఘాల నాయకులు, గ్రామస్తులు ఉన్నారు.

గీత కార్మికుడికి గాయాలు

ముత్తారం, డిసెంబర్ 30: మండలంలోని లక్కారం గ్రామానికి చెందిన గీత కార్మికుడు పందాల సాయిలు గౌడ్ సోమవారం గాయపడ్డాడు. గ్రామ శివా రులోని చెరువు కట్టపై ఈత చెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా, ప్రమాదవశాత్తు కాలు జారి కిందపడ్డాడు. దీంతో చేయి, కాలుకు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే పెద్దపల్లి దవాఖానకు తరలించారు.

అనుమతి లేని పాఠశాలలపై చర్యలు: డీఈవో

పెద్దపల్లి కమాన్, డిసెంబర్ 30 : జిల్లాలో ప్రభుత్వ అనుమతి లేకుండా నడుపుతున్న ప్రైవేట్ పాఠశాలలను తనిఖీ చేసి చర్యలు తీసుకోవాలని డీఈవో డీ మాధవి సోమవారం ఎంఈవోలను ఆదేశించారు. జిల్లాలోని కొన్ని ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ గుర్తింపు లేకుండానే సీబీఎస్ఈ అని తప్పుడు ప్రచారాలు చేస్తూ అడ్మిషన్లు కల్పిస్తున్నట్లు తమకు ఫిర్యాదులు వచ్చాయని పేర్కొన్నారు. అలాంటి పాఠశాలలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ గుర్తింపు లేని పాఠశాలల్లో పిల్లలను చేర్పించవద్దని తల్లిదండ్రులకు సూచించారు. కొన్ని ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలు ఈ-టెక్నో, పబ్లిక్, కాన్సెప్ట్, ఇంటర్నేషనల్, ఒలింపియాడ్, అనుమతి లేని సీబీఎస్ఈ లాంటి పేర్లతో ప్రవేశాల కోసం ప్రచారం చేయొద్దని ఆదేశించారు. సెలవు దినాలు, రెండో శనివారాల్లో పాఠశాలలు నడపరాదని, నిబంధనలు పాటించని ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటామని డీఈవో స్పష్టం చేశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

పాలకుర్తి, డిసెంబర్30: జీడీనగర్ యూనివర్సల్ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి సీనియర్ నెట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ ఇస్మాయిల్, హెచ్ఎం సయ్యద్ అఫ్జల్ తెలిపారు. విద్యార్థులు ఆదిత్య వర్మ, ఎండీఅల్తాఫ్, ఎ. శ్రీచరణ్‌చారి రాష్ట్రస్థాయి సీనియర్ నెట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈనెల 31 నుంచి జనవరి2 వరకు మహబూబ్‌నగర్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు ఉపాధ్యాయులు అభినందించారు.

నేడు ప్రత్యేక డ్రంకెన్ డ్రైవ్

ఓదెల, డిసెంబర్ 30: నూతన సంవత్సర వేడుకల సందర్భంగా యువత రోడ్ల పైకి వచ్చి అసభ్యంగా ప్రవర్తిస్తే చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని పొత్కపల్లి ఎస్ఐ దీకొండ రమేశ్ తెలిపారు. అర్ధరాత్రి వేళ మద్యం తాగి రోడ్ల పైకి వస్తే డ్రంకెన్ డ్రైవ్ ద్వారా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. న్యూ ఇయర్ వేడుకలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని యువతకు సూచించారు.

రెవెన్యూ డివిజన్‌గా మార్చాలి

కోల్‌సిటీ, డిసెంబర్ 30: రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లో అభివృద్ధి కుంటుపడి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారిందని స్వచ్ఛంద సంఘాల ఐక్య వేదిక ప్రతినిధులు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈమేరకు సోమవారం గోదావరిఖనిలో గోలివాడ చంద్రకళ అధ్యక్షతన ఐక్య వేదిక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్, వేదిక అధ్యక్షుడు దయాకర్, మద్దెల దినేశ్ మాట్లాడారు. రామగుండం కార్పొరేషన్‌లో అభివృద్ధిపై ఎవరికీ ధ్యాస లేదని, బల్దియా అధికారులు అవినీతి మత్తులో తూగుతున్నారని ఆరోపించారు. గోదావరి వంతెన వద్ద ఆత్మహత్యల నివారణకు ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రామగుండంను రెవెన్యూ డివిజన్‌గా మార్చాలని కోరారు. అనంతరం ఇటీవల ఢిల్లీలో జాతీయ అవార్డు అందుకున్న మద్దెల దినేశ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో వేదిక ప్రతినిధులు చంద్రకళ, శివకుమార్, నసీమ, రమేశ్, అనురాజ్, చందు యాదవ్, అరవింద్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

జిల్లాస్థాయి సోషల్ ఫోరం పోటీలకు ఎంపిక

మంథని, డిసెంబర్ 30: తెలంగాణ స్టేట్ సోషల్ ఫోరం ఆధ్వర్యంలో మంథని మండల స్థాయి పోటీలను సోమవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల లో నిర్వహించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం లక్ష్మి, సోషల్ ఫోరం డిస్టిక్ వైస్ ప్రెసిడెంట్ బిరుదు మధుసూదన్, మండల కన్వీనర్ సీహెచ్. పోచయ్య ఆధ్వర్యంలో ఈ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ పోటీల్లో జిల్లా పరిషత్ హై స్కూల్ కేటగిరిలో ఎక్లాస్‌పూర్ జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన లక్ష్మీ ప్రసన్న ప్రథమ, మంథని జడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాల విద్యార్థిని వొల్లాల నవ్యశ్రీ ద్వితీయ, మంథని జడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాల విద్యార్థిని సాత్విక్‌రాజ్ తృతీయ స్థానంలో నిలిచారు. రెసిడెన్షియల్ స్కూల్ విభాగంలో గుంజపడుగు జడ్పీహెచ్ఎస్ విద్యార్థిని సీహెచ్. సాత్విక ప్రథమ, గుంజపడుగు జడ్పీహెచ్ఎస్ విద్యార్థని భార్గవి ద్వితీయ, టీజీఎంఆర్ఈజేఎస్ విద్యార్థిని లక్ష్మీప్రసన్న, శ్రీ నిత్య తృతీయ స్థానంలో నిలిచారు. విజేతలు జనవరి 4న పెద్దపల్లి జిల్లా కేంద్రంలో నిర్వహించే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించారని పోటీల నిర్వాహకులు తెలిపారు.